క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై అబ్దుల్ రహీం

జగిత్యాలక్రైం : జిల్లా కేంద్రంలోని మోచీ బజార్‌కు చెందిన గొల్లపల్లి శివకుమార్ కొద్దిరోజుల క్రితం టవర్‌సర్కిల్ పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను గుర్తించారు. గురువారం ఎస్సై అబ్దుల్ రహీం బాధితుడికి సెల్‌ఫోన్ అందజేశారు.

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

గొల్లపల్లి: బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఏలేటి స్వామిరెడ్డి ఆధ్వర్యంలో శంకర్‌రావుపేటకు చెందిన కాచర్ల గంగాధర్‌ను కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తన నియమకానికి సహకరించిన వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం కోశాధికారి గుర్రం రంజిత్, సంకటి గంగరాజు, దావన్‌పెల్లి జీవన్, కొండా రమేశ్, ఇందూరి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పెగడపల్లి : మండలంలోని వెంగళాయిపేట శివాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొని సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున ఆలయంలో వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నధానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండాల్‌రావు, సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ సుప్రియ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపెల్లి(వేములవాడ) : మండలంలోని కట్లకుంట గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆది శ్రీనివాస్ పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని వివరించారు. మహిళలు ఆయన రాఖీ కట్టారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. భీమారం మండలంలోని ఒడియాడ్ గ్రామానికి చెందిన సుమారు 20 మంది, కమ్మరిపేటకు చెందిన ఐదుగురు యువకులు ఆది శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మేడిపెల్లి, భీమారం మండలాల అధ్యక్షులు నరేశ్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్, నీరెటి మల్లేశం, బొమ్మెన ప్రశాంత్, చాందు, కల్లెడ నవీన్, శ్రీపతి దామోదర్, పంబల శంకర్, జక్కుల మల్లేశం, బైర శ్రీనివాస్, అడువాల రాకేశ్, గంగారెడ్డి, జలేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మల్లాపూర్ : మండలంలోని వేంపల్లిలో గురువారం అనారోగ్యంతో దొతుల బాలమ్మ (70) మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజ నర్సయ్యలతో పాటు నాయకులు బిట్ల నరేశ్, గుగ్లావత్ రాజేందర్, వార్డుసభ్యుడు మహేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ పంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాల కోసం రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ప్రకారం గ్రామంలోని ఎవరు మృతి చెందినా దహన సంస్కారాలకు రూ.10వేల అందజేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రాఖీ పండుగ

రాఖీ పండుగను జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అక్కా చెల్లెళ్లు, తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించుకున్నారు. తోబుట్టువులు తమ స్వగ్రామాలకు వచ్చి సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వేకువజామునే ప్రత్యేక పూజలు జరపగా భక్తులు బారులు తీరి దర్శనాలు చేసుకున్నారు. రాఖీలు కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు.

- సాక్షి నెట్‌వర్క్



కథలాపూర్‌లో నాయకులకు రాఖీ కడుతున్న తుల ఉమ



మల్లాపూర్ : కొత్తదాంరాజుపల్లిలో రాఖీ కడుతున్న ఎంపీపీ కాటిపెల్లి సరోజన



కొండగట్టు : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో..



జగిత్యాల టౌన్ : బస్సు డ్రైవర్‌కు రాఖీ కడుతున్న ఏఎన్‌ఎంలు



కోరుట్ల రూరల్: జోగిన్‌పెల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ వేడుకల్లో..



మెట్‌పల్లి : మున్సిపల్ ఉద్యోగి ముజీబ్‌కు రాఖీ కడుతున్న మహిళ

పనిచేయని నిఘానేత్రాలు

- పట్టణంలో 20 సీసీ కెమెరాల్లో పనిచేసేవి కేవలం తొమ్మిదే
- పోలీసులకు సవాల్‌గా మారిన కోల జలహత్య
- ఆరునెలలుగా పనిచేయని సీసీ కెమెరాలు



పనిచేయని సీసీ కెమెరాలు



రాయికల్‌లోని ఓ దుస్తుల దుకాణంలో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

రాయికల్: పట్టణంలోని కోల జలహత్యను ఛేదించేందుకు పోలీసులు సీసీ కెమెరాలను నమ్ముకోగా సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ప్రధాన కూడళ్లలో దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో హంతకుల కోసం వేట కొనసాగిస్తున్నారు. రాయికల్ మున్సిపల్‌లో దొంగతనాల నియంత్రణ, పోకిరీల బెడదను అరికట్టేందుకు పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద రూ.20 లక్షల వ్యయంతో 25 కెమెరాలను ఏర్పాటు చేయగా గత ఆరునెలల నుంచి కేవలం తొమ్మిది సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. రాత్రులు, ఉదయం పూట యువకులు గంజాయి మత్తులో వేగంగా వాహనాలు నడుపుతున్నారు. వాహనాల దొంగలు ఎక్కువకావడం, సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆరునెలలుగా పనిచేయట్లే

పట్టణంలోని 12 వార్డులుండగా దొంగతనాల నియంత్రణ కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్, ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్, పాత బస్టాండ్, ప్రభుత్వ పాఠశాలలు, శివాజీచౌక్ వంటి ప్రధాన ఏరియాల్లో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాల పాటు టెండర్ చేపట్టిన కాంట్రాక్టర్ సీసీ కెమెరాల పనిచేసేలా చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ ఆరునెలల నుంచి కేవలం తొమ్మిది సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తున్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు సరిగా మంజూరు చేయకపోవడంతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు, మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రాయికల్ పట్టణంలో కోల జల హత్య ఉదంతాన్ని ఛేదించేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా హంతకులను పట్టుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ సీసీ కెమెరాలు పని చేసినట్లయితే హంతకులను పట్టుకునే అవకాశం ఉండేదని పోలీసులు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలో అన్నివార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పనిచేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు బాగుచేయాలి



రాయికల్‌లో దొంగతనాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాగుచేయాలి. సాయంత్రం, రాత్రి వేళల్లో యువకులు బైక్‌లపై వేగంగా దూసుకెళ్తున్నారు. రాత్రివేళల్లో దొంగతనాలకు పాల్పడితే సీసీ కెమెరాల ద్వారా దొంగలను పట్టుకోవచ్చు. కొన్ని నెలలుగా పనిచేయకున్నా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, టికెన్‌సెంటర్ వ్యాపారి, రాయికల్

కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



పట్టణంలోని తొమ్మిది సీసీ కెమెరాలకు గాను కేవలం తొమ్మిది మాత్రమే పని చేస్తున్నాయి. పలుమార్లు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. తనకు బిల్లులు మంజూరు కాలేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేస్తే సీసీ కెమెరాలపై ప్రత్యేక నిఘా పెడతాం.

– అజయ్‌కుమార్, ఎస్సై

చికిత్స కోసం తరలింపు

కోరుట్ల : పట్టణ శివారులోని పెద్దగుండు వద్ద గురువారం రాత్రి మెట్‌పల్లి మండలం చింతలపేటకు చెందిన ఎర్రోళ్ల హన్మాండ్లు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరుట్లలో పర్యటించి మెట్‌పల్లి వెళ్తున్న క్రమంలో హన్మాండ్లు కోరుట్ల శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడగా తన కారులోనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

రూ. కోటితో గల్ఫ్ ఏజెంట్ పరారీ ?

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఓ గల్ఫ్ ఏజెంట్ గల్ఫ్ పంపిస్తానని చెప్పి రూ.కోటి వరకు వసూలు చేసి పరారైనట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సదరు వ్యక్తి దాదాపు కొల్వాయితో పాటు, బీర్‌పూర్ మండలంలోని చుట్టు పక్క గ్రామాలకు చెందిన పలువురు యువకులను గల్ఫ్‌తో పాటు, వివిధ దేశాలకు పంపిస్తానని, అక్కడ మంచి వేతనాలు ఉంటాయని నమ్మబలికి దాదాపు ముప్పైకి మందికి పైగా రూ.కోటి వరకు వసూలు చేశాడు. కాగా సదరు వ్యక్తి ఇంటికి వారం రోజుల నుంచి తాళం వేసి ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. కాగా దీనిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

పెగడపల్లి: మండలకేంద్రంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారిపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులు, పాదచారులను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో ఎప్పుడు మీదపడి దాడి చేస్తాయోనని జంకుతున్నారు. అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



నూలు పౌర్ణమి వేడుకలు



జంధ్యం ధరించి పూజలు చేస్తున్న పద్మశాలీలు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘం భవనంలో జంధ్యాల నూలు పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు చౌటపెల్లి తిరుపతి మాట్లాడుతూ నూలు పౌర్ణమి ప్రత్యేకించి పద్మశాలీలు నూలుతో వడికిన జంధ్యం దరింటమ్ ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు చౌటపెల్లి తిరుపతి, అందె లక్ష్మణ్, అంకం లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎనగందుల శేఖర్, గౌరవాధ్యక్షుడు అంకం భూమయ్య, గాజంగి సత్తయ్య, ధర్మపురి మల్లేశం, సామల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తశ్రద్ధలతో పూజలు

మెట్‌పల్లి : పట్టణంలో రాఖీపౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు మార్కండేయ ఆలయం నుంచి మార్కండేయ స్వామి విగ్రహాన్ని భక్తిగీతాలు, భజనల మధ్య పల్లకీలో ఊరేగింపుగా ఓంకారేశ్వర ఆలయానికి తీసుకెళ్లారు. ఓంకారేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి, తిరిగి ఆలయానికి వెళ్లారు. అనంతరం రాఖీపౌర్ణమి వేడుకలు జరిపారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు భాస్కర్, ప్రభాకర్, సంతోష్, శ్రీనివాస్,శివరాజం, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పద్మశాలీ కులోన్నతి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయుని శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ కులోన్నతి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల : భక్త మార్కండేయ శోభాయాత్ర



మెట్‌పల్లి : పల్లకీలో మార్కండేయ స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న పద్మశాలీలు

వేసవిని తలపిస్తున్న అటవీప్రాంతాలు



సారంగాపూర్ అటవీప్రాంతంలో ఎండిపోతున్న టేకు చెట్లు

- టేకు చెట్లకు తెగుళ్లు ఆశించి ఎండిపోతున్న ఆకులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో నెల రోజులుగా టేకు వృక్షాలపై తెగుళ్ల ఆశించడంతో టేకు చెట్ల ఆకులు మొత్తం ఎండిపోయి నేల రాలిపోతున్నాయి. తెగుళ్ల ఆశించిన వృక్షంపై మొదలు ఆకులు రంధ్రాలుగా ఏర్పడి, ఆ తర్వాత ఆకుపూర్తిగా ఎండిపోయి నేలరాలుతుంది. రెండు మండలాల్లో అటవీభూముల్లో అత్యధికంగా టేకు వృక్షాలు ఉండడంతో, ప్రస్తుతం ఆకులు ఎండిపోయినట్లు అవుతూ అటవీప్రాంతాల్లో ప్రస్తుతం వేసవిని తలపిస్తోంది. దీనిపై అటవీశాఖ సెక్షన్ అధికారి మహేశ్ మాట్లాడుతూ వర్షాలు తగ్గిపోవడంతో తెగుళ్ల సోకి ఆకులు ఎండి రాలిపోతున్నాయని, నెలరోజుల్లో తెగుళ్ల తీవ్రత తగ్గగానే మళ్లీ టేకువనాలు చిగురిస్తాయని తెలిపారు. టేకు చెట్లకు ఎలాంటి నష్టం ఉండదని, ఎదుగుదల మాత్రం తగ్గిపోతుందన్నారు.



రేచపల్లి అటవీ ప్రాంతంలో ఎండిపోతున్న టేకు వృక్షాలు

కాలువల్లో పూడిక, చెత్తను తొలగించండి



పోసానుకుంట కింది నుంచి పొలాలకు వెళ్లే కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

సారంగాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింది ప్రధాన కాలువల కింది ఫీడర్ చానళ్లలో పూడిక, చెట్లు, ఇతర మొక్కలు మొలిచి కాలువల నుంచి నీరు పంట పొలాలకు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డి–53,12 ఎల్, 1ఆర్ కాలువ ద్వారా సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాలకు నీరు చేరుతుంది. పోసానుకుంట సమీపంలో పిచ్చిమొక్కలు, చెట్లు, చెత్తతో కాలువలో మొత్తం పేరుకుపోయింది. దీంతో దిగువన పంట పొలాలకు నీరు సరిగా చేరడం లేదని రైతులు తెలుపుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రికార్డుల పరిశీలన

రాయికల్: మండలంలోని సింగరావుపేట, అల్లీపూర్ గ్రామాల్లో గురువారం డీఎల్‌పీవో శ్రీనివాస్ గ్రామ పంచాయతీలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. నూతనంగా చేపట్టే గ్రామ పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు.

భూమిపూజ

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో 6,7 వార్డుల్లో రూ.12.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణానికి గురువారం ఎంపీటీసీ మోర విజయలక్ష్మి భూమిపూజ చేశారు. ఎంగిల్‌విండో చైర్మన్ రాజలింగం, కో ఆప్షన్ మెంబర్ మొఖీద్, వార్డు సభ్యులు అనిత, సిరిపురం వనిత, ప్రవళిక పాల్గొన్నారు.